## తహసీల్దార్ ఎదుట మాజీ నక్సల్స్ బైండోవర్



బైండోవర్ చేసిన పలువురు మాజీ నక్సలైట్లు

వేలేరు, నవంబర్ 6 : మండలంలోని పలు గ్రామలకు చెందిన మాజీ నక్సలైట్లను వేలేరు తహసీల్దార్ ముందు బైండోవర్ చేసినట్లు స్థానిక ఎస్సై డీ హరిత తెలిపారు. సోమవారం ఆమె వివరాలు వెల్లడించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ముందస్తుగా బైండోవర్ చేసినట్లు ఆమె తెలిపారు. కాగా శాలపల్లి, మద్దెలగూడెం, వేలేరు గ్రామాలకు చెందిన సూమారు ఏడుగురు వ్యక్తులను సోమవారం బైండోవర్ చేసినట్లు ఎస్సై హరిత పేర్కొన్నారు.

## భూతగాదాలో కాంగ్రెస్ ఎంపీటీసీ..

లింగాలఘనపురం, నవంబర్ 6 : భూతగాదాలో నేలపోగుల కాంగ్రెస్ ఎంపీటీసీ గుగ్గిళ్ల నర్సయ్యను పోలీసులు తహసీల్దార్ వినయలత ఎదుట సోమవారం బైండోవర్ చేశారు. నేలపోగులకు చెందిన వడ్లకొండ పెంటయ్య, కాంగ్రెస్ ఎంపీటీసీ గుగ్గిళ్ల నర్సయ్య, ఆయన సోదరుడు నాగయ్య మధ్యన గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో దాడులు జరిగే వరకూ వీరి మధ్య ఘర్షణ నెలకొంది. ఈ విషయంపై ఇరువర్గాలూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇరువర్గాలపై పోలీసులు కేసు నమోదు చేసి తహసీల్దార్ఎదుట బైండోవర్ చేయించారు.

# పాలకుర్తిలో 'హస్త'వ్యస్తం..

- కాంగ్రెస్‌లో సభ్యత్వమే లేని యశస్వినిరెడ్డికి టికెట్ ఇవ్వడంపై రగిలిపోతున్న క్యాడర్
- పార్టీకి రాజీనామా చేసిన టీ-పీసీసీ ఎన్నారై సెల్ కన్వీనర్ యర్రంరెడ్డి తిరుపతి
- ఆయనకు మద్దతుగా పాలకుర్తి నియోజకవర్గ ముఖ్యనేతల మూకుమ్మడి రాజీనామా
- టీ-పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డికి నాయకుల లేఖ
- నేడు బీఆర్ఎస్‌లో చేరే అవకాశం



విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత యర్రంరెడ్డి తిరుపతిరెడ్డి

జనగామ, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ పాలకుర్తిలో కాంగ్రెస్ పార్టీ భారీ కుదుపుకు లోనైంది. నియోజకవర్గానికి చెందిన పలువురు ముఖ్యనేతలు సోమవారం మూకుమ్మడి రాజీనామా చేస్తూ సంతకాలతో కూడిన లేఖను టీ-పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డికి పంపించారు. ప్రాథమిక సభ్యత్వం లేని మామిడాల యశశ్వినిరెడ్డికి పార్టీ టికెట్ కేటాయించడం ఏమిటని గ్రామస్థాయి నుంచి నియోజకవర్గం వరకు కాంగ్రెస్ క్యాడర్ రగిలిపోతున్నది. పాలకుర్తి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టికెట్ ఆశించిన ఎన్నారై అనుమాండ్ల ఝాన్సీలక్ష్మిరెడ్డి కొద్దినెలలుగా నియోజకవర్గంలో పర్యటించి ఎన్నికల ప్రచారం కూడా చేశారు. ప్రవాసాంధ్రురాలుగా ఉన్న ఆమె తనకు భారత పౌరసత్వం కల్పించాలని చేసుకున్న దరఖాస్తును నిబంధనల మేరకు సిటిజన్ షిప్ ఇవ్వలేమని అధికారులు తిరస్కరించారు. దీంతో కోడలు మామిడాల యశ్వినిరెడ్డిని రంగంలోకి దింపిన ఝాన్సీలక్ష్మిరెడ్డి కాంగ్రెస్ టికెట్ ఆమె పేరిట ఇప్పించుకున్నారు. వారం రోజులుగా నియోజకవర్గంలో పర్యటిస్తూ ఎన్నికల ప్రచారం చేస్తున్న అత్తాకోడలు వెంట పార్టీ శ్రేణులు అంటీ ముట్టనట్లుగానే వ్యవహరిస్తున్నాయి. ఇన్నాళ్లుగా నివురుగప్పిన నిప్పులా ఉన్న కాంగ్రెస్ ముఖ్యనాయకులు సామూహికంగా రాజీనామాలు చేస్తూ తీసుకున్న నిర్ణయం పాలకుర్తి నియోజకవర్గంలో సంచలనంగా మారింది. కనీసం ప్రాథమిక సభ్యత్వం కూడా లేని వ్యక్తికి కాంగ్రెస్ అధిష్టానం అభ్యర్థిగా నిర్ణయించి బీ-ఫారం ఇవ్వడాన్ని నిరసిస్తూ పాలకుర్తి కాంగ్రెస్ టికెట్ ఆశించిన టీ-పీసీసీ ఎన్నారై సెల్ రాష్ట్ర కన్వీనర్ యర్రంరెడ్డి తిరుపతిరెడ్డి తీవ్ర అసంతృప్తితో పార్టీకి రాజీనామా చేసి లేఖను టీ-పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డికి పంపించారు. ఆయనకు మద్దతుగా కొడకండ్ల మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గండిపెల్లి యాకయ్య, పాలకుర్తి మండల మైనార్టీ సెల్ నాయకుడు, మాజీ కో-ఆపరేటివ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎండీ సలీం, తెలంగాణ ఉద్యమకారుల సంఘం జనగామ జిల్లా అధ్యక్షుడు గనగాని రాజేందర్ గౌడ్, కొరిపల్లి మాజీ సర్పంచ్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఇస్లావత్ రవి, ఎస్టీ సెల్ అధ్యక్షులు జె.రాహుల్, కొడకండ్ల మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి టీ.మహేందర్‌రెడ్డి, దేవరుప్పుల మండల సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కాసాని ఎర్రయ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, తొర్రూరుకు చెందిన అనిల్, జిల్లా కాంగ్రెస్ నాయకుడు అల్లం ప్రదీప్‌రెడ్డి సహా పాలకుర్తి నియోజకవర్గంలోని పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల, తొర్రూరు మండలాల్లో వివిధ హోదాల్లో పనిచేసిన పలువురు ముఖ్యనాయకులు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. వీరంతా త్వరలో హైదరాబాద్‌లో బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకోనున్నారు.

# జిల్లాలో మూడోరోజు 5 నామినేషన్లు

- జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ స్థానాలకు ఒక్కొక్కటి..
- పాలకుర్తిలో మూడు నామినేషన్లు దాఖలు
- ఇప్పటి వరకు దాఖలైనవి 10
- పాలకుర్తిలో మొదటి సెట్ పత్రాలు అందజేసిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, సతీమణి ఉషా




పాలకుర్తిలో ఎన్నికల అధికారి రోహిత్‌సింగ్‌కు నామినేషన్ పత్రాలు అందచేస్తున్న ఎర్రబెల్లి ఉషాదయాకర్‌రావు

జనగామ, నమస్తే తెలంగాణ/స్టేషన్ ఘన్‌పూర్/ పాలకుర్తి రూరల్, నవంబర్ 6 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా లో నామినేషన్ల పర్వం ఊపందుకుంది. మొన్నటి వరకు తిథి, నక్షత్రాలు, మంచి ముహూర్తం లేకపోవడంతో స్వతంత్రులు మినహా ప్రధాన రాజకీయ పార్టీల నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎవరూ ముందుకు రాలేదు. నామినేషన్ల ఘట్టం మొదలైన మూడోరోజు సోమవారం మూడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. మూడు రోజుల్లో కలిపి ఇప్పటి వరకు మొత్తం 10 నామినేషన్లు దాఖలైనట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శివలింగయ్య వెల్లడించారు. జనగామ అసెంబ్లీ స్థానం నుంచి తరిగొప్పుల మండలం సోలిపురం గ్రామానికి చెందిన చెవిటి అర్జున్ (స్వతంత్ర అభ్యర్థి)గా నామినేషన్ దాఖలు చేశారు. స్టేషన్‌ఘన్‌పూర్ అసెంబ్లీ స్థానం నుంచి హనుమకొండ జిల్లా ధర్మసాగర్‌కు చెందిన కొట్టే ఏసోబు ధర్మసమాజ్ పార్టీ(స్వతంత్ర అభ్యర్థి) నుంచి నామినేషన్ దాఖలు చేశారు. పాలకుర్తి అసెంబ్లీ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఆయన సతీమణి ఎర్రబెల్లి ఉషాదేవి(బీఆర్ఎస్ అభ్యర్థి) నామినేషన్లు వేశారు. ధర్మ సమాజ్ పార్టీ నుంచి వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కాట్రపల్లికి చెందిన బుడిద సునీల్ స్వతంత్ర అభ్యర్థజగా నామినేషన్ దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ రోహిత్ సింగ్ తెలిపారు.. ఈనెల 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు.13న నామినేషన్ల పరిశీలన , 15న ఉపసంహరణ ఉంటుందని, ఆదేరోజు ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల తుది జాబితా వెల్లడిస్తారు. అనంతరం అభ్యర్థుల్లో ఎవరెవరికి ఏ గుర్తులు కేటాయించారన్నది బహిరంగ పరుస్తారని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.

# భార్యను హతమార్చిన భర్త అరెస్ట్

తొర్రూరు, నవంబర్ 6 : భార్యను హతమార్చి, ఆత్మహత్యగా చిత్రీకరించిన భర్తను పోలీసులు అరెస్ట్ చేశారు. డీఎస్పీ వెంకటేశ్వరబాబు కథనం ప్రకారం.. దంతాలపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని తూర్పుతండాకు చెందిన గుగులోత్ సారమ్మ(30) ఈ నెల ఒకటిన ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. భర్త,అత్తమామ వేధింపులతో తన కూతురు చనిపోయిందని నెల్లికుదురు మండలం దుర్గాభవానీ తండాకు చెందిన ఆమె తండ్రి భూక్యా బిచ్చా దంతాలపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్సై రమేశ్‌బాబు కేసు నమోదు చేశారు. సారమ్మ మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం మహబూబాబాద్ ఏరియా వైద్యశాలకు తరలించారు. పోస్టుమార్టం అనంతరం వైద్యులు ఇచ్చిన రిపోర్ట్‌తో అసలు నిజం బయటపడింది. సారమ్మను భర్త రాజేందర్ హతమార్చాడని గుర్తించిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. తన భార్య సారమ్మ అనారోగ్యపాలై తనకు శారీరకంగా సహకరించకపోవడంతోపాటు ఆమెకు ఉన్న వ్యాధి పిల్లలకు సోకుతుందన్న అనుమానంతో గొంతు నులిమి హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. ఎవరికీ అనుమానం రాకుండా ఉరేసుకున్నట్లు చిత్రీకరించానని తెలిపాడు. సోమవారం రాజేందర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## పాలకుర్తి కాంగ్రెస్ అభ్యర్థిపై హైకోర్టులో పిటిషన్

దేవరుప్పుల, నవంబర్ 6: పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి మామిడాల యశస్వినిరెడ్డి ఓటు హక్కుపై ఓ వ్యక్తి హైకోర్టులో సోమవారం పిటిషన్ దాఖలు చేశారు. ఇప్పటికే యశస్వినిరెడ్డి ఓటుపై కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలకు, సంబంధిత జిల్లా అధికారులకు, కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి పలువురు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. అయినా పార్టీ అధిష్టానం ఆమెనే పాలకుర్తి కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించడంతో సదరు వ్యక్తులు నేరుగా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కాగా యశస్వినిరెడ్డి ఓటు తన తల్లిగారిల్లు దిండి చింతలపల్లిలో ఉంది. ఆమె పాస్‌పోర్టు, ఆధార్ హైదరాబాద్‌లో ఉన్నట్టు రికార్డులు తెలుపుతున్నాయి. మరోవైపు ఎన్నికల నియమావళి ప్రకారం పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్‌కు ముందు 180 రోజులు దేశంలో ఉండాలనే నిబంధన ఉందని పిటిషనర్ వాదన. ఈ నేపథ్యంలో ములగాసి శివకుమార్ అనే వ్యక్తి పిటిషన్ దాఖలు చేయగా అడ్వకేట్ అనిరుద్ వీరికి న్యాయవాదిగా ఉన్నారు. యశస్వినిరెడ్డి ఈ నెల 9న పాలకుర్తిలో నామినేషన్ వేయడానికి సిద్ధమవుతున్న తరుణంలో సోమవారం హైకోర్టులో పిటిషన్ వేయడం చర్చనీయాంశమైంది

## మండల సర్వసభ్య సమావేశం వాయిదా

నర్మెట, నవంబర్ 6 : ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఎలాంటి తీర్మానాలు ప్రవేశపెట్టకూడదనే కారణంతో నర్మెట మండల సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీపీ తేజావత్ గోవర్ధన్ తెలిపారు. మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నూతన తీర్మానాలు ప్రవేశపెట్టే అవకాశం లేకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాలోత్ శ్రీనివాస్, ఎంపీడీవో ఖాజానయీమోద్దీన్, వైస్‌ఎంపీపీ మంకెన ఆగిరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు కల్యాణం మురళి, రామిని శివరాజ్, ఆమెడపు కమలాకర్ రెడ్డి, బానోత్ శంకర్‌నాయక్, జాల శ్వేతాకిషన్, ముప్పిడి లక్ష్మీప్రతాప్, పండుగ విజయానర్సయ్య, నీరేటి రాణీసుధాకర్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

WANTED

jobs Apply Now!

★హన్మకొండలోని ప్రముఖ లోన్స్ ఆఫీసు నందు పని చేయుటకు లేడీ టెలికాలర్స్ కావలెను. జీతం: 10,000/-, సంప్రదించండి సెల్: 9440805391.
NTW-321463

★రామకృష్ణ గ్రూప్ (TS & AP No. 1) Hyd., VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు వర్కర్లు (M/F) కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు కమీషన్: 5,000/-. Ph: 9281452833, 6281208600.
NT-320535

HMDA అప్రూవ్డ్ ప్లాటు

★దసరా స్పెషల్ ఆఫర్! 5 గ్రా గోల్డ్ ఫ్రీ HMDA పరిధిలో ఇప్పుడే ఇల్లు కట్టుకొని ఉండటానికి తక్కువ ధరలోనే రెరా అప్రూవ్డ్ ఓపెన్ ప్లాట్స్ బ్యాంక్ లోన్, స్పాట్ రిజి: 8639545438.
NT-320354

PLOT FOR SALE

★దీపావళి ఆఫర్: DTCP లేఅవుట్ ఆలేరు. 9 లక్షల విలువ గల ప్లాట్ 6లక్షలకే అంతే కాకుండా మీ 6లక్షలు తిరిగి పొందే అవకాశం. సంప్ర|| సెల్: 7382143246/8309782092
NTK-316678

CHANGE OF NAME

I, Sri. GOPU NEEL KUMAR, S/o. GOPU VIJAY KUMAR, H.No. 4-7, R/o. Peddavangara Village and Mandal, Mahabubabad, T.S.-506317, INDIA, have changed my father name VIJAYAKUMAR to GOPU VIJAY KUMAR for all purposes and For all future purposes.

CHANGE OF NAME

I, Smt. GOPU MAMATHA, W/o. GOPU NEEL KUMAR, D/o. B RAMA RAO, H.No 4-7, R/o. Peddavangara Village and Mandal, Mahabubabad, T.S.-506317, INDIA, due to my marriage my surname is changed "BEKKAM MAMATA" to "GOPU MAMATHA" for all purposes and For all future purposes.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA
9182777563
9182777618
9182777213

WARANAGAL
9182777556
9182777557
9182777558

JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565